

నేడు గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రూప్ 2 సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు గురజాడ గ్రంథాలయం ఎదురుగా గల రవిరాజ్ మార్బుల్స్ మేడపైన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ హరీష్, సిహెచ్ రామకృష్ణ తెలిపారు. శనివారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు, పిడిఎఫ్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని జయప్రదం చేయాలని కోరారు.



మన్యం జిల్లాకు పరిశ్రమలొచ్చేనా?

- అటవీ, వ్యవసాయ ఉత్పత్తులతో అపారమైన అవకాశాలు
- డిప్యూటీ సిఎం చొరవ చూపుతారా?
- గ్లోబల్ సమ్మిట్‌పై కొత్త ఆశలు

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి ఏడాది కూడా కాలేదు. ఈనెల 3,4తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతం కావడంతో మన్యం జిల్లాలో పరిశ్రమలేమైనా ఏర్పాటవుతాయా అని యువత ఎదురు చూస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావడం, రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంఒయూలు కుదిరినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మన్యం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మేరకు చొరవ చూపుతారనే చర్చ మొదలైంది. మన్యం జిల్లాలో లభించే అటవీ వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమలు స్థాపించాలని ఈ ప్రాంత రైతులు, యువకులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా పార్వతీపురం మన్యం జిల్లా. ఈ జిల్లాలో గల 15మండలాల్లో గిరిజన జనాభా అధికం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ ఎక్కువగా ఉంటుంది. గిరిజనులు ఏడాది పొడవునా నమ్ముకున్న అడవితల్లి ఒడిలో సేదతీరుతూ రకరకాల ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తారు. వీటిలో ప్రధానమైన ఉత్పత్తులు చింతపండు, జీడిపిక్కలు. మన్యం జిల్లాలో ఉన్న రెండు ఐటిడిఎల పరిధిలో గిరిజనులు అధికంగా జీడితోటల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అడవుల్లో సహజసిద్ధంగా పెరిగిన చింత చెట్ల నుంచి చింత పండును సేకరించి విక్రయాలు చేస్తారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా గిరిజనుల జీవితాల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో గల గిరిజన మండలాలను కలిపి పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పాటు చేశారు. మన్యం జిల్లాలో అపారమైన ఖనిజ సంపదతో పాటు పుష్కలంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయి. ఈ ఉత్పత్తుల ఆధారంగా ఏవైనా పరిశ్రమలు స్థాపిస్తే గిరిజన ఉత్పత్తుల కు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించడానికి అవకాశం కలుగుతుంది. ప్రస్తుత సీజన్‌లో ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా చింతపండు ఉత్పత్తి జరుగుతోంది. ఒకప్పుడు అటవీఉత్పత్తుల సేకరణపై గిరిజన సహకార సంస్థకి గుత్తాధిపత్యం ఉన్నందున గిరిజనులు సేకరించిన ఉత్పత్తులను జిసిసికే విక్రయించే వారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అటవీ ఉత్పత్తులపై గుత్తాధిపత్యం లేకుండా చేయడంతో గిరిజనులు తాము సేకరించిన ఉత్పత్తులను నచ్చిన చోట, నచ్చిన వ్యాపారులకు విక్రయించుకునే అవకాశం లభించింది. గుత్తాధిపత్యం ఉన్న సమయంలో జిసిసి మాత్రమే చింతపండును కొనుగోలు చేసేది. గత కొన్నేళ్లుగా జిసిసి నామమాత్రపు కొనుగోళ్లకే పరిమితమవుతోంది. దీంతో చింతపండు ఎక్కువగా వ్యాపారులకే విక్రయిస్తున్నారు. జీడి పిక్కల ఉత్పత్తి కూడా మన్యం జిల్లాలో ఎక్కువగా ఉంటుంది. గిరిజనులు ఉత్పత్తి చేసిన జీడిపిక్కలకు కూడా తగిన గిట్టుబాటు ధర లభించడంలేదు. ఈ పంటను కూడా ఎక్కువగా వ్యాపారులే కొనుగోలు చేస్తారు. ప్రయివేటు వ్యాపారుల తూనికల్లో గిరిజనులు మోసపోతూ నష్టపోతుంటారు. వీటిపై ప్రభుత్వ అధికారుల నియంత్రణ, పర్యవేక్షణ కొరవడడంతో గిరిజనులు నష్టపోతున్నారు.

మన్యం మంత్రి దృష్టి పెడతారా?

జిల్లాలో చింతపండు, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. అలాగే ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంట కూడా ఎక్కువగా సాగవుతోంది. దీంతో పశువుల దాణా తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయొచ్చు. వీటితో పాటు మన్యం జిల్లాలో సహజసిద్ధంగా లభించే ఖనిజ సంపద ఆధారంగా కూడా పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి. ఒడిశా, ఆంధ్రా మధ్య వివాదాస్పద కొటియా గ్రామాల్లో పుష్కలంగా ఖనిజ సంపద వుంది. మాంగనీస్, బాక్సైట్, గ్రానైట్ వంటి ఖనిజాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. మన్యం జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక, ఉద్యోగ, ప్రజల పక్షాన ఉండే

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా నాయకులు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ప్రజా పక్షాన నిలబడి, వారి గొంతును చట్ట సభలలో వినిపించే ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమా ప్రభ ను గెలిపించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా, ఉత్తరాంధ్రకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తూ వస్తున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారాలు వేస్తున్నారని అన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఉన్న 3లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా, సుప్రీం కోర్టు ఇచ్చిన కనీస వేతనాలు తీర్పును కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పని భద్రత లేకుండా అభద్రతతో జీవిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలపై చెత్తపన్ను, యూజర్ ఛార్జీలు, ఆస్తి పన్ను భారాలు వేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మన సమస్యలపై చట్ట సభలలో గొంతుకు వినిపించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనన్నారు. మన తరుపున మాట్లాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రమా ప్రభ ను గెలిపించాలని కోరారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు బి.రమణ, కె.త్రినాథ్ పాల్గొన్నారు.

7న 50 వేల మందితో మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల ఏడో తేదీన మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50 వేల మంది మహిళలతో మానవహారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 'బాల్య వివాహాలను రూపుమాపుదాం - టీనేజ్ ప్రెగ్నెన్సీని అరికడదాం' అనే నినాదంతో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మానవహారం ఉదయం 8.30 నుంచి 9.30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ వద్దనున్న ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి ఆర్అండ్‌బి, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, ఐసు ఫ్యాక్టరీ , దాసన్నపేట , కోట జంక్షన్ , సింహాచలం మేడ , ఆనంద గజపతి ఆడిటోరియం వరకు మానవహారం కొనసాగుతుందని వివరించారు. అనంతరం 10 గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియం లో పలు కార్యక్రమాలు, ప్రముఖ వక్తల సందేశాలు ఉంటాయని వెల్లడించారు. ఈ మానవహారంలో డ్వాక్రా మహిళలు, సఖి బృందాల సభ్యులు, వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు, సచివాలయాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఐసిడిఎస్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, డిఆర్‌డిఎ, మున్సిపల్ కమిషనర్, మెప్మా ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళలంతా పెద్ద ఎత్తున పాల్గొని మానవహారాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేలా, తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉండే సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేసేలా అవగాహన కలిగించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.




మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, సినీనటి తమన్నా

మల్బార్ షోరూం ప్రారంభం

అలరించిన సినీనటి తమన్నా

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం రైల్వేస్టేషన్ ఎదురుగా నూతనంగా నిర్మించిన పోర్టు సిటీ సెంట్రల్ మాల్ లో ఏర్పాటు చేసిన మల్బర్ షోరూమ్‌ను డిప్యూటీ స్పీకర్ కోళ్లగట్ల వీరబధ్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సురేషబాబుతో కలిసి సినీనటి తమన్నా బాటియా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షోరూమ్‌లో తిరుగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ నాణ్యమైన ఆభరణాలకు మారుపేరు మల్బర్ అని, విజయనగరం ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 16వ షోరూమ్ అని, తన చేతులు మీదిగా ప్రాంభించిడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఆ సంస్థ చైర్మన్ ఆహ్మద్ మాట్లాడుతూ విజయనగరంలో షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు నుంచి వస్తున్న ఆదరణ మరువలేనిదని కొనియాడారు. తమ సంస్థ నాణ్యమైన బంగారం, డైమాండ్ వస్తువులను ప్రజలకు అందించేందుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. మొదటి కొనుగోలుదారులు కరణం గంగాధర్ కుటుంబానికి తమన్న చేతులు మీదుగా అందజేశారు. హీరోయిన్ తమన్నాను చూసేందుకు అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు.



అభివాదం చేస్తున్న తమన్నా

మోడల్ రైల్వేస్టేషన్‌గా బొబ్బిలి

డిఆర్ఎం అనూప్ కుమార్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వాల్తేర్ డిఆర్ఎం అనూప్ కుమార్ సతపతి అన్నారు. బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించి, దేశంలో ఆదర్శంగా మారుస్తామని వెల్లడించారు. మూడోలైన్ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫాం పనులు వేగవంతం చేస్తామన్నారు. బొబ్బిలి-సాలూరు నూతన రైలుబస్సు కోసం ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. సాలూరు లైనులో కోవిడ్ కారణంగా ఐదు రైళ్లను నిలిపేసినట్లు చెప్పారు. పాత ట్రాక్ కావడంతో టెస్టు చేస్తామన్నారు. సాలూరు-బొబ్బిలి రైలుబస్సులో ప్రయాణికులు తక్కువమంది రాకపోకలు చేస్తున్నారని తెలిపారు. రైలు ఎక్కిన ప్రయాణికుల్లోనూ టికెట్లు తీయకుండా ఎక్కువమంది ప్రయాణించడంతో రైల్వేకు నష్టం వస్తుందన్నారు. ఆయనతో రైల్వే అధికారులు ఉన్నారు.



బొబ్బిలి రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డిఆర్ఎం అనూప్ కుమార్

రైల్వే సమస్యలపై వినతి

రైల్వేస్టేషన్లో సమస్యలపై సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివ, వాసు, మణి, డేవిడ్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఎస్.సాంబయ్య వేర్వేరుగా వినతి పత్రాలు డిఆర్ఎం అనూప్ కుమార్‌కు అందజేశారు. బొబ్బిలి రైల్వే స్టేషన్ నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నా మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. టాటా-యశ్వంత్ పూర్ రైలుకు హాల్ట్ కల్పించాలని, సాలూరు రైలు బస్సును పునరుద్ధరించాలని కోరారు. రైల్వే స్టేషన్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, విశాఖ నుంచి రాయగడకు షటిల్ రైలు వేయాలని కోరారు. సమస్యలపై డిఆర్ఎం సానుకూలంగా స్పందించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 67 కేంద్రాల్లో నిర్వహణ
- ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 15 నుంచి జరిగే ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేది వరకు మొత్తం 67 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా పరీక్షలు సాఫీగా రాసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నిరంతర విద్యుతు, తాగునీటి కల్పనకు చర్యలు తీసుకున్నామని, కంట్రోల్ రూం ఏర్పాటుచేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, పరీక్షలకు సంబంధించిన సమస్యలకు, సందేహాలకు 08922-237988 నంబరును సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 24,469 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 28,726 మంది.. 53,195 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 6 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. చూసిరాతలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని, పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని కోరారు.

పోస్టల్ సొసైటీ ఎన్నికల్లో

ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘ సభ్యుల విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తపాలా శాఖ సొసైటీ ఎన్నికల్లో 9 డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికల్లో నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ అనుబంధ సభ్యులు విజయకేతనం ఎగురవేశారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఓటింగ్ ప్రక్రియ లో మొత్తం 381మంది ఓటర్లకు గాను 353 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 9 డైరెక్టర్ పదవులను ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘం నాయకులు క్లీన్ స్వీప్ చేసి సత్తా చాటారు. గెలుపొందిన డైరెక్టర్లలో ఇ.శంకర్ నాయుడు, పతివాడ శ్రీనివాసరావు(కబడ్డీ), ఊడికల శ్రీనివాసరావు, ఎస్.సత్యారావు, వి.రుద్రపతాప్, ఎస్.సుధాకర్, పి.అప్పలకృష్ణ, పెంటపాపయ్య, ఎ.నాగేశ్వరరావు విజయం సాధించారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఉద్యోగుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఎన్ఎఫ్‌పిఇ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు.



విజయం సాధించిన డైరెక్టర్లు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

భూముల రీసర్వే వేగవంతం ● ఎస్.కోటలో పర్యటించిన కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. శనివారం ఎస్‌కోట మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ బూత్‌కు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేసి, క్యూలైన్లు నిర్వహించాలని సూచించారు. ఎండ తగలకుండా షామియానా ఏర్పాటు చేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఓటుకు ఆధార్ సీడింగ్‌పై బిఎల్ఒలను ఆరా తీశారు. శనివారం సాయంత్రానికి ఓటర్ స్లిప్పుల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు.

పాఠశాలలోని 9, 10 తరగతులను కలెక్టర్ సందర్శించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి, వారు పరీక్షలకు సిద్ధమవుతున్న తీరును తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన సిలబస్‌పై ఆరాతీశారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను తనిఖీ చేశారు. ట్యాబ్ ద్వారా వారు ఎన్ని పరీక్షలకు హాజరైనదీ ఆరాతీశారు. ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ప్రతిరోజూ పాఠశాలకు ట్యాబ్‌ను తీసుకురావాలని ఆదేశించారు.

తిమిడి గ్రామంలో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎన్ని ఎకరాలు సర్వే చేస్తున్నదీ ఆరా తీశారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ డి.శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పి.కీర్తన, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

అందరి నోటా మండలి మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను..! అందరి నోటా శాసన మండలి ఎన్నికల మాటే వినిపిస్తోంది. యువతలోనూ ఉద్యోగుల్లోనూ, నిరుద్యోగుల్లోనూ, వ్యాపారుల్లోను... ఇలా ఒకటేమిటి కేవలం చదువుకున్నోళ్లే కాకుండా అన్ని తరగతులవారి నోటా ఎమ్మెల్సీ ఎన్నికల మాటే వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. మరో వారం రోజుల్లో అంటే ఈనెల 13వ తేదీనే ఎన్నిక జరుగుతుంది. ఈనేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచార పర్వాన్ని ముమ్మరం చేశారు. వీరిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందంజలో ఉన్నారు. ఆమెకే గెలుపు అవకాశాలు ఉన్నాయని కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. ఎన్ని తంటాలు పడినా అధికార, ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థులు రెండో స్థానం కోసమేనంటూ నెటిజన్ల సెటైర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇంతకీ ఎవరు గెలిస్తే ఏం ఉద్ధరిస్తారు? అని చర్చిస్తున్నవారు కూడా లేకపోలేదు. ఆ మాట కొస్తే వైసిపి బలపర్చిన అభ్యర్థికి అవకాశం దక్కితే ఇప్పటికే ఆ పార్టీ తరపున ఉన్న 42మంది ఎమ్మెల్సీల గుంపులో చేరి అందరి మాదిరిగా భజన చేయడం తప్ప స్వతంత్రత ఉండనే ఉండదు. టిడిపి అభ్యర్థి గెలిస్తే వైసిపి తిట్ల పురాణాన్ని ఎదుర్కోవడం తప్ప, ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వంటివారి సమస్యలపై ప్రస్తావించే అవకాశం గగనం అన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. అటువంటి నైతక విలువలు కూడా ఆ పార్టీలో కనిపించడం లేదు. అదే మేథావులు చుక్కారామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, డాక్టర్ ఎంవిఎస్ శర్మ వంటివారితో ఆవిర్భవించిన పిడిఎఫ్ (ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) బలపర్చిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కడితే ఇప్పటి మాదిరిగానే ప్రజల గొంతుకై శాసన మండలిలో వినిపిస్తారు. పాలకపార్టీల ఏకపక్ష ధోరణికి అడ్డుకట్టు పడినట్టుగా కూడా ఉంటుంది. అలా కాకుండా పాలకపక్షాలకు అవకాశం కల్పిస్తే ప్రజావ్యతిరేక విధానాలకు పట్టం కట్టినట్టే. ఈ మాటలు అంటున్నది ఆమె అభిమానులో, బంధువులో కాదు సుమా... ఎంతో మంది విద్యావంతులు, మేధావులు, వర్శిటీల విసిలు, అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు. వాస్తవానికి ప్రభుత్వానికి మంచి సూచనలు, సలహాలు అందాలంటే శాసన



మండలిలో రాజకీయాలతో సంబంధం లేని మేధావులు కూడా అడుగుపెట్టాలని రాజ్యాంగం చెబుతోంది. అందులో భాగంగానే ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఒక మంచి మేధావిని ఎన్నుకునేందుకు అవకాశం దక్కింది. ఆ విధంగా శాసన మండలి పున:ప్రారంభం తరువాత రెండు దఫాలు పిడిఎఫ్ తరపున ఎంవిఎస్ శర్మ పోటీచేసి ఘన విజయం సాధించారు. పాదయాత్ర, సైకిల్ యాత్ర వంటి రూపాల్లో ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజనులు, మత్స్యకారులు ఇలా అన్ని తరగతులవారిని కలుసుకుని వారి సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కరించేవారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని జిల్లా పరిషత్, డిఆర్‌సి వంటి సమావేశాల్లోనూ జనం సమస్యలు చర్చకు తెచ్చేవారు. ఎంతో కొంత జనానికి న్యాయం జరిగేది. గడిచిన ఎన్నికల్లో పాలకపార్టీలన్నీ ఏకమై బిజెపి అభ్యర్థిని గెలిపించారు. గెలిచిన ఆసామీ కనీసం ప్రజాసమస్యలపట్ల ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక ఈసారి అధికార, ప్రతిపక్షాలు కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీకి తెరలేపాయి. ఇందుకు బలమైన కారణాలే కనిపిస్తున్నాయి. అటు శాసన సభలోగానీ, ఇటు శాసన మండలిలోగానీ అధికార, ప్రతిపక్షాలకు చెందిన సభ్యులు ఒకరినొకరు విమర్శించుకోవడం, తిట్ల పురాణాలు తప్ప ప్రజల తరపున చర్చించిన దాఖలాలు దాదాపు లేవనే చెప్పుకోవచ్చు. ఇటువంటి తరుణంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై స్పష్టమైన వైఖరితో మాట్లాడుతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు మొదలుకుని, రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసే నూతన విద్యా విధానాలు, అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో ఎత్తివేత, జాబ్ క్యాలెండర్ తీయకపోవడం, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగులకు ఇచ్చిన పిఆర్‌సి రద్దు హామీ నిలబెట్టుకోవాలని గట్టిగానే సభలో నిలదీస్తున్నారు. విధాన పరంగా టిడిపిది కూడా ఇదే వైఖరి కావడంతో ఆ రెండు పార్టీలకు పిడిఎఫ్ కంటగింపుగా మారింది. ప్రజాసమస్యలు ప్రస్తావనకు వస్తే ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందని గ్రహించిన వైసిపి, టిడిపి తమ పార్టీల తరపున అభ్యర్థులను రంగంతోకి దింపాయి. పట్టభద్రులు మాత్రం పిడిఎఫ్ మద్దతుతో స్వతంత్రంగా పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపు మొగ్గు చూపుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

చట్టాలపై అవగాహనతోనే న్యాయం

ప్రజాశక్తి-బొండపల్లి

చట్టాలపై అవగాహనతోనే మహిళలకు న్యాయం లభిస్తుందని గజపతినగరం మున్సిఫ్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.వేదవతి అధ్యక్షతన సఖి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో తగాదాలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి, వారికి న్యాయ సాయం అందించాల్సిన అవసరముందన్నారు. నిరుపేదలైతే కోర్టుల్లో వారి తరుపున వాదించేందుకు న్యాయవాదులు అందుబాటులో ఉంటారని చెప్పారు. గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో, తదితర చట్టాలపై ఆమె సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో ఎంఇఒ భవానినాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆరిఫ్ కరుణ్, ఎపిఎం సులోచనదేవి, న్యాయవాదులు రమణాజీ, ఆదినారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

6, 13 తేదీల్లో పోలీసు 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 6, 13వ తేదీల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ఎస్‌పి దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన రద్దు కారణంగా ప్రజలెవరూ అర్జీలు ఇచ్చేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురికావద్దని ఎస్‌పి విజ్ఞప్తిచేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి మానిటరింగ్ సెల్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం

రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలోని గ్రామాలలో తాగునీటి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో శనివారం నుంచి మోనటరింగ్‌సెల్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఇ ఉమాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెల్ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8గంటల వరకు పనిచేస్తుందని, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను మానిటరింగ్ సెల్ నెంబరు 9100120711 కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

12న డెల్టా పోటీ పరీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఆంగ్ల భాష ప్రతిభా పరీక్షను ఈ నెల 12న ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు డెల్టా అధ్యక్షులు ఎ.విజయ మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయివేట్ మినహా అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఇంగ్లీష్ సిలబస్ ఆధారంగా జరిగే ఈ పరీక్షలో పాల్గొనవచ్చని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూ.10 రుసుం చెల్లించి 9440744741 నంబర్‌ను సంప్రదించి, తమ విద్యార్థుల పేర్లను ఈనెల 8లోగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఉద్యోగులు బాధ్యతతో పని చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి, ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలని ఎంపిడిఒ గన్నవరం కాశీ విశ్వనాధరావు అన్నారు. శనివారం ఉంగరాడ, అంబకండి తదితర గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ముందుగా శాఖల వారీగా పనితీరుపై చర్చించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, ఇంజనీరింగ్ శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపరచాలన్నారు. 924 సర్వీసులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈయనతోపాటు పంచాయతీ కార్యదర్శులు గౌరమ్మ, హేమ సుందర్ ఉన్నారు.

ప్రసన్నకుమారికి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆర్‌వి ప్రసన్నకుమారి సంతాప సభను శనివారం ఆ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ ద్వారం దుర్గాప్రసాదరావు, బి.అనూరాధ, విశ్రాంత అధ్యాపకులు బి.ఎ.నారాయణ, పి.త్రినాధరావు, తదితరులు ప్రసన్నకుమారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కేశవరావు తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను శనివారం అడ్మిషన్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. కొత్తవలస జూనియర్ కళాశాల, జెబివిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని కెల్ల గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.సత్యం, వైద్యులు లెనిన్ మాట్లాడుతూ గ్రామస్తులకు కేన్సర్ సంబంధిత పూర్తి సూచనలను, సలహాలను అందించారు. గ్రామ సెక్రటరీ జగన్నాథం, ఎఎన్‌ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి రేవతి, రెడ్‌క్రాస్ ఫీల్డ్ సిబ్బంది, రమణ పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన సంక్షేమ హాస్టళ్ల మెస్ ఛార్జీలు పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కళాశాల హాస్టళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నామమాత్రంగా మెస్ ఛార్జీలు పెంచారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నూతన మెనూకు పెంచిన ఛార్జీలు ఏమాత్రం సరిపోవన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

జొన్నవలసలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచనల మేరకు జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జొన్నవలస చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ కంది రమాదేవి, వైసిపి గ్రామ అధ్యక్షులు కంది గణపతి చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కంది రమాదేవి

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి అస్మా ఫర్హీన్

ప్రజాశక్తి- విజయనగరం కోట

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అస్మా ఫర్హీన్ సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ క్రైం, మహిళల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్ పై సెబ్ ఆధ్వర్యాన శనివారం తిరుమల నర్సింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అస్మా ఫర్హీన్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా యుక్త వయస్సులోనే చెడు వ్యసనాలకు అలవాటు పడతారని, కావున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రేమ పేరుతో మోసం చేసే వారికి దూరంగా ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అనవసరంగా తాకితే ధైర్యంగా తిరగబడాలని అన్నారు. సైకాలజిస్టు డాక్టర్ ఎస్‌వి రమణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు అలవాటు పడి అనేక మానసిక రుగ్మతలకు గురవుతున్నారని, అటువంటి వారిని గుర్తించి సైకాలజిస్ట్ ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. డాక్టర్ హరీష్, డీఅడిక్షన్ సెంటర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మాట్లాడుతూ ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసలైనట్లయితే వారిని డీఅడిక్షన్ సెంటర్ కు తీసుకువస్తే వైద్యం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చునని అన్నారు. సెబ్ సిఐ బి.రామగోపాల్ మాట్లాడుతూ ఎటువంటి మాదక ద్రవ్యాలతో పట్టుబడిన యువత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎఎస్ శైలజరాణి, సిఐ బి.మధుకుమార్, జోనల్ కోర్డినేటర్ బి.రాజేష్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎం.స్వాతి, తిరుమల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సెట్విజ్ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా ఫర్హీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, శశిభూషణరావు

స్పోకెన్ ఇంగ్లీషు కమ్యూనికేటివ్ పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యూనికేట్ టు ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తే జీవితంలో ఉన్నతమైన స్థానాలకు చేరుకుంటారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రముఖ స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్ లాంగ్వేజ్ స్కిల్స్ ఎక్స్ పర్ట్ చంద్రశేఖర్ కురిటి రచించిన కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ అనే పుస్తకాన్ని శనివారం మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు గ్లోబల్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ భాష పై పట్టు అందరికీ అవసరమని అన్నారు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు లభించడానికి అవకాశం ఉందని చెప్పారు ఈ సందర్భంగా పుస్తక రచయిత చంద్రశేఖర్‌ను మంత్రి బొత్స అభినందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పంచేంద్రియాలను ఉపయోగిస్తూ సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవడం కోసం 20 ఏళ్లుగా తాను శ్రమించి 21.5 అనే సైకలాజికల్ మెథడ్ తయారు చేశానన్నారు. ఈ పుస్తకం ద్వారా లక్షలాదిమంది సులభంగా ఇంగ్లీషులో నైపుణ్యం సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్‌రావు, ప్రముఖ జీవన నైపుణ్యాల నిపుణులు జెట్టీ దొంతల, సిడగం రామకృష్ణ పాల్గొన్నారు.

స్పందించారు.. నీరిచ్చారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట.

మండలంలోని చుక్కవానిపాలెంలో కుళాయిల ద్వారా అధికారులు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. శనివారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన ' అలంకారప్రాయంగా కుళాయిలు.. చుక్కనీరు రాక అవస్థలు' అనే కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఇ.సత్యకిశోర్ స్పందించారు. వెంటనే సిబ్బందిని స్పందించి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినా సాంకేతిక లోపం వల్ల తాగునీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. లోపాన్ని సవరించి, ఆ గ్రామంలో తాగునీటి సరఫరా చేసినట్లు చెప్పారు. దీంతో గ్రామస్తులు 'ప్రజాశక్తి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

లైంగిక నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- రాజాం

లైంగిక నేరాల పట్ల ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంఘ చైర్మన్ ఎం. బాబు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాలికలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అతను లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించే చట్టం, యాసిడ్ దాడులు, బాలికల అపహరణ తదితరులు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ, రాజాం న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు ఎస్. జయలక్ష్మి, న్యాయవాదులు రెడ్డి విజయకుమార్, చల్లా శ్యాంప్రసాద్, ముదిలి శ్రీనివాసరావు, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, రాజాం టౌన్ ఎస్ఐ విబిఆర్‌కే రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని ఓక్లాండ్ పాఠశాలలో శనివారం కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిహెచ్ రవి ప్రారంభించారు. కరస్పాండెంటు డాక్టర్ పాల్ శ్రీనివాస్, చైర్మన్ శివన్నారాయణ, ప్రిన్సిపాల్ రవి గ్రాడ్యుయేట్స్‌కి డిప్లొమాస్ అందజేసారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ పాల్ శ్రీనువాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా విధ్యార్థుల్లో చిన్నతనం నుండే మనోధైర్యం నింపడంతో పాటు విజయం యొక్క విలువలను తెలియజేయడానికి తోడ్పడుతుందన్నారు. చైర్మన్ శివన్నారాయణ మాట్లాడుతూ విధ్యార్థుల అభివృద్ధికి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహించేదుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 240 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి గార్డెన్ గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న కరస్పాండెంట్ పాల్ శ్రీనివాస్



విద్యార్థుల చదువును పరిశీలన చేస్తున్న ఎంఇఒ జి.శ్రీదేవి

కుంపల్లి పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ శ్రీదేవి శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, లెసన్‌ప్లాన్ వివరాలు, వర్క్ నోట్ బుక్స్, తదితర వివరాలను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. సిబ్బందికి బోధనపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి సునందిని పాల్గొన్నారు.

ప్రవీణ్‌కు కోలగట్ల అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తల్లి లాంటి తెలుగు భాషను, కీర్తిని వెలుగులోకి తేవడానికి కృషి చేస్తున్న ప్రతిఒక్కరికీ తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఇటీవల జరిగిన పిఎం యువ మెంటార్‌షిప్‌కు ఎంపికైన దేవరకొండ ప్రవీణ్ కుమార్ శనివారం కోలగట్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల.. ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు. ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి దేవరకొండ ప్రవీణ్ కుమార్ చేసిన పరిశోధనలకు గాను ఇటీవల ప్రధానమంత్రి యువ పురస్కారం అందుకోవడం సంతోషకరమని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 23 భాషల్లో నాలుగు అంశాలలో పోటీలు నిర్వహించగా 16 వేల ఎంట్రీలు వచ్చాయని, వీటిలో 75 ఎంట్రీలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు. వీటిలో ఆంధ్రాలో అజ్ఞాత స్వాతంత్ర వీరులు, వీర వనితలు అంశాన్ని ఎంచుకొని వారి వివరాలు, త్యాగాలను ఒక శీర్షికగా ప్రచురించారని చెప్పారు. దీనికిగాను కేంద్ర ప్రభుత్వం తరపున ఆమోదం లభించడం ఎంతైనా అభినందనీయమని కోలగట్ల అన్నారు. కార్యక్రమంలో ఎపిపిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు టి.బి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలవలసలో అన్నదానం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చింతలవలస వెంకటేశ్వర ఆలయం 39వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండఅప్పలనాయుడు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్‌ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే

స్నేహ పూర్వక వాతావరణం ఉండాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరం

బాలలతో పనిచేసే వసతి గృహాల్లో సిబ్బంది అందరూ స్నేహ పూర్వక వాతావరణంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సూచించారు. శనివారం కలెక్టరేట్ పరిధిలో గల జిల్లా వెనుకబడిన తరగతి జిల్లా అధికారి కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన వసతి గృహం సంక్షేమ అధికారుల సమావేశంలో వారిని ఉద్దేశించి మాట్లాడారు. త్వరలో జరగబోయే పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, ఒత్తిడి లేకుండా ప్రణాళికా బద్దంగా చదివించాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సమతుల్య ఆహారం సరైన సమయంలో అందించాలని అన్నారు. పరీక్షలు రాయబోయే విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వసతిగృహాల్లో కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు

జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ హిమబిందు మాట్లాడుతూ పిల్లలు కు నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పించాలని, బాల్య వివాహాలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని, కుటుంబ సభ్యులను తప్ప ఇతరులను వసతి గహాల్లోకి అనుమతించరాదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు జి. హిమబిందు, జిల్లా బిసి సంక్షేమ అధికారి. ఎం.యశోధ రావు జిల్లా ఉప సంక్షేమ అధికారులు శ్యామలకుమారి, బివి రమణ, బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ,సిబ్బంది , జయలక్ష్మి, సంధ్య, సరస్వతి, యాళ్ల నాగరాజు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

దర్గాను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్‌పి, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం బాబామెట్టలోని ఖాదర్ బాబా 64వ సూఫీ గంధ మహోత్సవాల్లో భాగంగా శనివారం దర్గా, దర్బార్ షరీఫ్‌ను రాష్ట్ర ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు దర్శించుకున్నారు. హజరత్ అతావుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ బాబా కుమారులు, విజయనగరం ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డా. ఎం.డి. ఖలీలుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు), గులాం ముహమ్మద్ జాఫర్ సాదిక్ (జాఫర్ బాబు) దర్బార్ సంప్రదాయం ప్రకారం వీరికి స్వాగతం పలికారు. అనంతరం దర్బార్ లో బాబాకు వీర భద్ర స్వామి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా యువజన దినోత్సవం

ప్రజాశక్తి-డెంకాడ

జొన్నాడ వద్దగల లెండి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు అండ్ సిస్టమ్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థి సంఘం విధుర ఆధ్వర్యంలో అంతర కళాశాలల యుజనోత్సవం కళాశాల ఆవరణలో శనివారం ఉల్లాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విజయవాడకు చెందిన టెక్ మహీంద్ర హెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ వి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. స్టూడెంట్ దశలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ద్వారా యువతలో ఆత్మ విశ్వాసం నింపేందుకు దోహద పడుతుందన్నారు. సరైన క్రమశిక్షణతో చదువుకుంటూ భావ వ్యక్తీకరణ నైపుణ్యాన్ని సాధన చేస్తే ఐటి రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సిసిసి డిజిటల్ అధినేత ఉండవల్లి నాగవీర్ మాట్లాడుతూ భారత దేశం ఇతర దేశాలకు ధీటుగా టెక్నాలజీని అందించే స్థాయికి చేరుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి, హెచ్‌ఒడి డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యాన అతిథులను సత్కరించారు.



మాట్లాడుతున్న టెక్‌మహీంద్ర హెచ్‌ఆర్ మేనేజర్ వి.శ్రీనివాసులరెడ్డి

నేరాలు ఘోరాలు

ప్రమాదవశాత్తూ వృద్ధుడు మృతి

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-బాడంగి

ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని ఓ వృద్ధుడు మృతిచెందాడు. మండలంలోని వాడాడలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఆర్.జయంతి కథనం ప్రకారం..

మండలంలోని వాడాడ గ్రామానికి చెందిన దూసి దువ్వయ్య (80) బొబ్బిలిలో కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల ఒకటో తేదిన పింఛను డబ్బుల కోసం బొబ్బిలి నుంచి వాడాడ గ్రామానికి వచ్చాడు. అనంతరం తన పొలాన్ని చూడటానికి వెళ్లి, అక్కడ ఎండిపోయిన పొదలను కాల్చి శుభ్రం చేసేందుకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు వేగంగా వ్యాపించి దువ్వయ్యకు అంటుకున్నాయి. వృద్ధాప్యం కారణంగా అక్కడి నుంచి తప్పించుకోలేక ప్రమాదవశాత్తూ కాలిపోయి అక్కడికక్కడే మరణించాడు. శనివారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి కాలిన మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయంతి కేసు నమోదు చేశారు.



పట్టుబడిన బియ్యంతో సిఎస్‌డిటి జగన్

టన్ను రేషన్ బియ్యం పట్టివేత

విజయనగరం : నగరంలోని మంగళవీధి, పూల్‌బాగ్ కాలనీల్లో అక్రమంగా రవాణా అవుతున్న 1044 కేజీల రేషన్ బియ్యాన్ని శనివారం సిఎస్‌డిటి జగన్ ఆధ్వర్యాన పట్టుకున్నారు. ఎం.అచ్యుతరావు పలువురు పేదల నుంచి బియ్యం కొనుగోలు చేసి తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న సిఎస్‌డిటి పట్టుకున్నారు.

నగదు చోరీ దొంగ అరెస్టు

విజయనగరం : నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్ రాధాకృష్ణ వరప్రసాద్ క్యాష్ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరప్రసాద్ రూ.లక్షా 60,620లను బైక్ కవర్‌లో పెట్టి ప్రయాణిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డగించి నగదుతో పరారయ్యారు. అందులో నిందితుడు ద్వారపూడికి చెందిన బెల్లాన బాలరాజును శనివారం ద్వారపూడి బ్రిడ్జివద్ద పోలీసులు పట్టుకున్నారు.

ఎఎస్‌ఐపై దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

విజయనగరం : రూరల్ పోలీసు స్టేషనులో పని చేస్తున్న ఎఎస్ఐ పి.రామారావు విటి అగ్రహారం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా చింతలవలసకు చెందిన చింతపల్లి తౌడు అనే ఆటో డ్రైవరు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై ఎఎస్ఐ ఫిర్యాదుపై రూరల్ పోలీసులు నిందితుడిపై 353, 307 ఐపిఎస్ సెక్షన్లుతో కేసు నమోదు చేసి, సిఐ టివి తిరుపతిరావు దర్యాప్తు చేపట్టారు. సంఘటన జరిగినప్పటి నుండి పరారీలో ఉన్న ఆటో డ్రైవరు చింతపల్లి తౌడును శనివారం అరెస్టు చేసి, రిమాండుకు తరలించగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిఐ తిరుపతిరావు తెలిపారు.